ప్రజాశక్తి

శుక్రవారం 12 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు

- దేశ విచ్ఛిన్న కుట్రలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్
- రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్న కూటమి పార్టీలు
- సీతారాం ఏచూరి భవన్ ప్రారంభోత్సంలో ఎంఎ.బేబీ, వి.శ్రీనివాసరావు



సీతారాం ఏచూరి భవన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఎ.బేబీ, వేదికపై వి.శ్రీనివాసరావు, పుణ్యవతి, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ విలేకరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీతారాం ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ పిలుపునిచ్చారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి, మత విద్వేషాలు రగిల్చి లబ్ధి పొందాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తు న్నాయని అన్నారు. ఆ కుట్రలపై వామపక్ష శక్తులన్నింటినీ కలుపుకుని ఐక్య



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద ఘన నివాళి

పోరాటాలు నిర్వహించనున్నామన్నారు. విశాఖ నగరం లోని మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో నిర్మితమైన సీతారాం ఏచూరి భవన్ (సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం)ను ఆయన గురువారం ప్రారంభించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పార్టీ నాయకులతో కలిసి నివాళ్లర్పించారు. అనంతరం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయడు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తామిద్దరం 1979లో పాట్నాలో విద్యార్థి సంఘం మహాసభలు జరిగినప్పుడు ఆలిండియా బాధ్యతల్లోకి వచ్చామని, అప్పటి నుంచి కలిసి పనిచేశామని అన్నారు. విశాఖలో నిర్మించిన సీతారాం ఏచూరి భవన్ ఉద్యమ, ప్రజోపయోగ కేంద్రంగా నిలువనుందని అన్నారు. ఆంధ్రాలో ఎక్కడైతే అల్లూరి విజ్ఞాన కేంద్రాలు పెట్టారో అక్కడ నైపుణ్య శిక్షణ కేంద్రాలు పెట్టడాన్ని తాను గుర్తించానని, అది మంచి విషయమని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏచూరి స్ఫూర్తితో విశాఖలో మిగతా 2లో..



ఉక్కు రక్షణ కోసం గాజువాకలో సాగుతున్న మహా ప్రదర్శన, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎంఎ.బేబీ

ఉక్కుపై కేంద్రం కుట్రలను తిప్పికొట్టండి

- ప్రైవేటుపరం చేసేందుకే ఇఐఐల పేరిట ముక్కలుగా విభజన
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ
- స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం గాజువాకలో మహా ప్రదర్శన, సభ

వార్త మెయిన్‌లో..

పారిశుద్ధ్య కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

▶ వార్త 5లో..

రణభేరి జాతాను విజయవంతం చేయాలి

▶ వార్త 8లో..

ఆటో కార్మికులకు రూ.30 వేలు ఇవ్వాలి

▶ వార్త 7లో..



మాట్లాడుతున్న అమర్‌నాథ్, చిత్రంలో బూడి ముత్యాల నాయుడు తదితరులు

మెడికల్ కాలేజీలను పిపిపికి ఇవ్వడం తగదు

వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్

వార్త 6లో..

క్షేమంగా విశాఖకు..

నేపాల్ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన బాధితులు

ప్రజాశక్తి - గోపాలపట్నం : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నేపాల్ వెళ్లి ఇటీవల జరిగిన అల్లర్లలో చిక్కుకున్న వారిని స్వప్రాంతాలకు తీసుకొచ్చే చర్యల్లో భాగంగా రాష్ట్రానికి చెందిన 144 మంది ప్రయాణికులతో విశాఖ విమానాశ్రయానికి గురువారం రాత్రి ఓ ప్రత్యేక విమానం వచ్చింది. ఎయిర్ పోర్టులో దిగిన వెంటనే వారంతా తమ కుటుంబీకుల చెంతకు చేరి తాము ఎలాంటి భయానక పరిస్థితి ఎదుర్కొన్నదీ తెలిపారు. కళ్ళ ఎదుటే మారణ హోమం, అల్లర్లు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు తమ కళ్లముందే తగలబడిపోయాయని అన్నారు. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక తలోదిక్కున దాక్కున్నామని, ఎట్టకేలకు క్షేమంగా స్వరాష్ట్రానికి వచ్చామని అన్నారు. నేపాల్ నుంచి వచ్చిన వారికి ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు



విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న బాధితులు

మంచినీరు బాటిల్, బిస్కెట్లు పంపిణీ చేసి స్వాగతం పలికారు. అలాగే వారి స్వప్రాంతాలకు చేరుకోవడానికి ప్రభుత్వపరంగా వాహనాలు ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో తెలుగు పౌరులకు స్వాగతం పలికిన వారిలో విశాఖ ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, బేబీనాయన, ఎన్.ఈశ్వరరావు, కోళ్ల లలిత కుమారి, అదితి గజపతి, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు

ఏర్పాటైన భవనం పార్టీ విస్తరణకు తోడ్పడుతుందని, ఉద్యమాల కేంద్రంగా విలసిల్లనుందని అన్నారు. ట్రంప్ సుంకాలు, మోడీ ఆర్థిక, మతోన్మాద, విచ్ఛిన్నకర దాడులు దేశం ముందు నేడు సవాళ్లుగా ఉన్నాయన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో కూటమి పార్టీల నేతలు, గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు ప్రజలను ఎలా మోసగించారో తెలియజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐ పేరిట డిపార్టుమెంట్లను లేపేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మిట్టల్ పరిశ్రమకు గనులు అడుగుతున్నారని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని 'కూటమి' పార్టీలు భ్రష్టుపట్టిస్తున్నాయని తెలిపారు. అనంతపురంలో బుధవారం 'సూపర్ 6 - సూపర్ హిట్' పేరిట జరిగిన సభ రాష్ట్ర ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికేనని ఎద్దేవా చేశారు. అడ్డమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి 'దుష్టత్రయం'గా మారిందని విమర్శించారు. ఎమ్మెల్యేలంతా రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారన్నారు. మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం పెట్టి ఏడాది దాటినా ఇంతవరకూ అపాయింట్‌మెంట్లు లేవని, రోస్టర్ విధానం ఓపెన్ చేయలేదని అన్నారు. సంపద సృష్టించే పేరుతో కార్పొరేట్లకు దోచిపెడుతున్నారన్నారు. ప్రజలు అప్పుల ఊబిలో ఉన్నారని, మైక్రోఫైనాన్స్ సంస్థలు వేధింపులకు పాల్పడుతున్నాయని తెలిపారు. విశాఖలో గతంలో అదానీకి భూములిచ్చారని, తాజాగా గూగుల్‌కి వందల ఎకరాలు కట్టబెట్టాలని చంద్రబాబు చూస్తున్నారని అన్నారు. ఇలా కార్పొరేట్లకు ఇచ్చిన స్థలాల్లో సిపిఎం ఎర్రజెండాలు పాతడానికి సిద్ధంగా ఉందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రుషికొండ భవనాలను ప్రజల సందర్శనార్థం వాడాలని, మ్యూజియంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ సీతారాం ఏచూరి పేరు మీద విశాఖలో నిర్మించిన సిపిఎం జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవంలో తాను భాగస్వామి కావడం గర్వంగా ఉందన్నారు. ఏ కార్యాలయమూ లేకుండానే విశాఖపట్నం నుంచి పోరాటాలు ప్రారంభించామని, అనంతరం జగదాంబ వద్ద సొంత భవనం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఉద్యమ అవసరాలు తీర్చేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని, రానున్న రోజుల్లో ఈ ప్రాంత ప్రజలు పోరాటాలకు, సాంస్కృతిక, అభ్యుదయ కార్యక్రమాలకు ఈ భవనం వేదిక అవుతుందని ఆమె అన్నారు.

పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ చిన్న ఉద్యమంతో విశాఖలో ప్రారంభమైన సిపిఎం ఉత్తరాంధ్రలో ఎలాంటి ప్రభావవంతమైన పాత్రను పోషించిందో తెలిపారు. బంగారు కుటుంబాల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. విశాఖలో 1.40 లక్షల మంది ఇల్లు లేని వారు ఉన్నారని, వారందరూ బంగారు కుటుంబాల్లో ఎందుకు భాగం కాలేదని ఆయన ప్రశ్నించారు బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని మొన్న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో స్పష్టమైందని అన్నారు. విశాఖను రక్షించే బలం వామపక్షాలకు ఉందన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి భవన్ అనుకున్న సమయం కంటే ముందే పూర్తయిందని తెలిపారు. ఈ భవనానికి ప్రధాన దాతలు కార్మికులు, సిపిఎం కార్యకర్తలు, శ్రేయోభిలాషులేనని తెలిపారు. విశాఖలో పార్టీ కార్యాలయాల ఏర్పాటు నేపథ్యాన్ని, అవి అందించిన సేవలను తెలియజేశారు. బూర్జువా పార్టీల కార్యాలయాలు వాళ్ల మంత్రులు, నాయకులు వచ్చినపుడు మాత్రమే కళకళలాడుతుంటాయని, సిపిఎం కార్యాలయాలు ఎల్లప్పుడూ ప్రజలతో రద్దీగా ఉంటాయని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పిఠాపురం కాలనీలో పాత భవనాన్ని తొలగించి కొత్తగా పార్టీ ఆఫీసు నిర్మాణం ఏడాదిలోపే చేశామన్నారు. దేశానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి అశేష సేవలు అందించిన సీతారాం ఏచూరి పేరును దీనికి పెట్టామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వామపక్ష నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీతారాం ఏచూరి భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను, సీతారాం ఏచూరి.. ఓ సోషలిస్టు ఆచరణ పథం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో.. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే తరిమికొడతాం

ప్రజాశక్తి-అనంతగిరి: హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం అనంతగిరి మండలం వేంగడ పంచాయితీ బంజోడ గ్రామంలో గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు లచ్చన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ, నవయుగ కంపెనీలకు జిల్లాలో అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు మజ్జివలస కేంద్రంగా వేంగడ, పైనంపాడు, వాలాసి పంచాయితీలను దారాదత్తం చేసి గిరిజనులను జల సమాధి చేయడానికి పూనుకుంటున్నారు. గిరిజనుల భూములు ఆక్రమణ చేస్తూ కొండలు, గుట్టలు వారి ఆధీనంలో తీసుకోవడానికి నవయుగ కంపెనీ ఏజెంట్లు సరిహద్దు, హద్దులు దిమ్మలు వేసి గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నవయుగ ఏజెంట్ ప్రభుత్వ అధికారులతో కలిసి గ్రామాల్లో ప్రవేశించి గిరిజనులతో వాగ్వివాదానికి దిగి బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ గౌరవ అమీత్ బర్దార్ దృష్టికి తీసుకు వెళ్లి వివరించామన్నారు.గ్రామాల్లో కొత్త వ్యక్తులు, గుర్తు తెలియని వారు సంచరిస్తే ప్రజలు పోలీసులకు పిర్యాదు చేయాలన్నారు.గ్రామాల్లో శాంతి భద్రతలు ఎవరైనా సృష్టిస్తే పోలీసులకు పిర్యాదు చేయాలని. మొండిగా వ్యవహరిస్తే తరిమి కొట్టాలన్నారు.

25న తపాలా అదాలత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈనెల 25న ఎంవిపి బస్ కాంప్లెక్స్ దరి పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయంలో 119వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ తెలిపారు.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టరట బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 22లోగా '119వ తపాలా అదాలత్' శీర్షికతో "కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం-530017" చిరునామాకు పంపాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన అర్జీలు స్వీకరించబోమన్నారు.

500 మందికి కోటక్ స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కోటక్ మహీంద్రా గ్రూప్ సిఎస్ఆర్ నిధులతో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500మందికి కోటక్ కన్య స్కాలర్‌షిప్‌ల అందించనున్నట్లు కోటక్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ హెడ్ (ఇసి) అరతి కొల్లుడ్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, 'కలలు కనండి దాన్ని వెంబడించండి,స్వంతం చేసుకోండి' అనే స్ఫూర్తిదాయకమైన నినాదంతో ప్రారంభమైన కోటక్ కన్య స్కాలర్‌షిప్‌లను దేశవ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికల ఉన్నత విద్య కలలను సాకారానికి చేయూతగా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్ఆర్ఐఎఫ్ హోం, నాక్ గుర్తింపు పొందిన సంస్థలలో స్టెమ్, మెడిసిన్, లా, ఆర్కిటెక్చర్, డిజైన్ తదితర రంగాలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అభ్యసించే బాలికలకు నాలుగేళ్లపాటు ఏటా రూ.1.50లక్షల స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు వెల్లడించారు.

యోగా టీచర్ కళాధర్‌కు సత్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆసియా పసిఫిక్ 3.0 యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో రెండు బంగారు పతకాలను సాధించిన యోగ మాస్టారు డాక్టర్ వికెవికె కళాధర్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బగ్చీ సత్కరించారు. విశాఖ నీలమ్మ వేపచెట్టు గుడి సమీపంలో గ్రణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందడుగు న్యూస్ ఛానల్ అధినేత మల్లేష్ ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. సినీ నటుడు ఐ. ప్రసన్నకుమార్, 33 వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, గోపికృష్ణ, బ్రహ్మకుమారి బి.కె రామేశ్వరి, లక్ష్మణ్ డిజిటల్ సైన్స్ అధినేత మొల్లేటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాతీయ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, సెర్ప్, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12, 13వ తేదీల్లో సాగరనగర్ సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ వద్ద ప్రత్యేక శిక్షణ సదస్సులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సదస్సుల్లో వెయ్యిమందికి ఎగ్‌కార్ట్‌లను అందజేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంవిపి కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రతపై గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కోరమండల్ ఫెర్టిలైజర్స్ అంద జేసిన గుడ్డ సంచులను విద్యార్థులకు పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించి, వాటికి దూరంగా ఉంచడం ద్వారా పర్యావరణ హితంగా, ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ కమ్యూనిటీ మేనేజర్ ఐ కృష్ణ కుమారి, హెడ్మాస్టర్ జాస్లిన్ ,ఉపాధ్యాయులు విద్యార్థులు మాట్లాడారు.

చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్య, ఆరోగ్య చట్టాలు అమలు చేయాలని గురువారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్) ప్రతినిధులు డిఇఒ బ్రహ్మాజీరావుకు, డిఎంహెచ్‌ఒకు వినతి పత్రాలు అందజేశారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు 25శాతం ఉచిత సీట్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం 2010ను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

క్వాంటమ్ టెక్నాలజీతో బహుముఖ ప్రయోజనాలు



గీతంలో క్విన్‌ఫోసిస్ వ్యవస్థాపకుడు మహేశ్వరరావు

ప్రజాశక్తి- మధురవాడ : క్వాంటమ్ టెక్నాలజీలను వివిధ రంగాలలో అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం ప్రణాళికా యుతంగా ముందుకు వెళుతోందని, ఈ పరిజ్ఞానం భవిష్యత్తులో బహుముఖ ప్రయోజనాలు అందించగలదని ప్రముఖ క్వాంటమ్ టెక్నాలజీ నిపుణుడు, క్విన్‌ఫోసిస్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.మహేశ్వరరావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ కంప్యూటర్ సైన్స్ విభాగం గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్వాంటమ్ టెక్నాలజీ ప్రయోజనాలపై ప్రసంగించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ఆధారంగా వాతావరణ మార్పులపై ఖచ్చితమైన, వేగవంతమైన సమాచారాన్ని అందించిడం వీలు పడుతుందన్నారు. ఔషధ రంగంలో కొత్త ఔషధాలను తక్కువ సమయంలోనే తయారు చేయడానికి క్వాంటమ్ కంప్యూటింగ్ దోహద పడుతుందని తెలిపారు. స్టాక్ మార్కెట్‌లను విశ్లేషించి వేగవంతమైన సమాచారాన్ని అందించడానికి ఈ పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో క్వాంటమ్ టెక్నాలజీ వినియోగం ప్రతి రంగంలో పెరుగుతుందని, దానికి తగ్గట్లుగా యువతరం లోతైన పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం యువత అవకాశాలను మెరుగు పరుస్తుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును మైనర్ సబ్జెక్టుగా బోధిస్తున్నామని తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగంలో క్వాంటమ్ మిషన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ ఆల్గారిథమ్స్ వంటి అంశాలను సిలబస్‌లో చేర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక బాసర లీడ్స్ స్కూల్‌లో గురువారం ఉత్సాహంగా, ఉల్లాసంగా డిపి వరల్డ్ సంస్థకు చెందిన ఐసిసి ఉమెన్స్ క్రికెట్ కప్ ట్రోఫీ టూర్ జరిగింది. స్థానిక బాసర స్కూల్ ఆడిటోరియంలో డిపి వరల్డ్‌తో ఐసిసి ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ (సిడబ్ల్యుసి) ట్రోఫీ టూర్‌ను హోస్ట్ చేశారు. ట్రోఫీ టూర్ మేనేజర్ జైద్ మాట్లాడుతూ, మహిళల క్రికెట్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను మమేకం చేసి క్రీడపై అవగాహన పెంచడానికి ఇంటరాక్టివ్ గేమ్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీ బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ ట్రోఫీ టూర్ జట్టుకు తొలుత స్వాగతం పలికారు. కళాశాల డీన్ ఎం.భాస్కరరావు, ప్రిన్సిపల్ రేఖా, హెచ్‌ఎం కేశవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఐసిసి ఉమెన్స్ క్రికెట్ కప్ ట్రోఫీ టూర్ ప్రోగ్రాంలో విద్యార్థులు

వేములవలసను సందర్శించిన జెడ్‌పి సిఇఒ



వేములవలసలో స్థానికులతో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస గ్రామపంచాయతీని గురువారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి సందర్శించారు. గ్రామంలో డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశీలించి, వాటిని క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. చెత్త సేకరణ షెడ్ వద్ద ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ పిట్స్ సక్రమంగా నిర్వహించాలంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జానకి, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, వేములవలస సెక్రటరీ రామకృష్ణ, వెల్లంకి గ్రామ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసెంట్ స్కూల్‌లో చౌక్ బాల్ టీం ఎంపిక

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస గ్రామంలోని అసెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రాష్ట్ర చౌక్ బాల్ టీం ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. వివిధ జిల్లాల నుండి వచ్చిన బాలుర, బాలికలతో నిర్వహించిన ఈ ఎంపికలలో ఒక్కొక్క జట్టుకు 12 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. పిఇటి సురేష్, రాష్ట్ర చౌక్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ సుధాకరరావు, సిఇఒ శివరామ్ ఆధ్వర్యాన ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ తరపున ఈ నెలాఖరులో జరగనున్న జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులకు అసెంట్ స్కూల్ డైరెక్టర్ బంగారునాయుడు, ప్రిన్సిపల్ శంకరరావు శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

ఉత్తేజంగా కళా ఉత్సవ్ ప్రారంభం



సోలో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కృష్ణలేఖకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో రెండ్రోజుల పాటు జరగనున్న కళా ఉత్సవ్-2025 పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్‌తో కలిసి జ్యోతి వెలిగించి కళా ఉత్సవ్‌ను ప్రారంభించారు. తొలిరోజు గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 4ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. వాయిద్యం, పాటలు, డ్యాన్స్ పోటీలను వ్యక్తిగత, గ్రూపుల విభాగాలుగా నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

'నడింపల్లి'లో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ పెద్దపాటి, సిఎండి డాక్టర్ పి.సుబ్బరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, ట్రిపుల్‌ఈ హెచ్‌ఒడి డాక్టర్ కృష్ణం నాయుడు సంయుక్తంగా ప్రారంభించారు. సదస్సు మొదటి రోజులో పునరుత్పాదక శక్తి వ్యవస్థలో పవర్ సిస్టమ్ ఎలక్ట్రానిక్స్, సుస్థిరమైన ఈవీ ఛార్జింగ్, మౌలిక సదుపాయాల కోసం పవర్ సిస్టమ్ ఎలక్ట్రానిక్స్"పై డాక్టర్ శంకర్ పెద్దపాటి ప్రసంగించారు. 'గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాలు తగ్గించడంలో పునరుత్పాదక శక్తి పాత్ర"పై డాక్టర్ పి.భరణి చంద్రకుమార్ ప్రసంగించారు. టియోరా ఆటోమేషన్ సిఇఒ ఎం.సతీష్ విద్యుత్ శక్తి పరిరక్షణపై మాట్లాడారు.

స్వాతి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని తాటి తూ రు గ్రామ సచివాలయం పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ గ్రామ సహాయకులుగా బి.స్వాతి అంకిత భావంతో విధులు నిర్వహించారని పలువురు ప్రశంసించారు. ఆమె పని చేసిన కాలంలో రైతుల సమస్యలను పరిష్కరించారని, వారి కష్టాలను వినేవారని కొనియాడారు. ఈమె వ్యవసాయ విస్తరణాధికారిగా ఉద్యోగోన్నతి పొంది ఆనందపురం మండలానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా పలువురు రైతులు, వ్యవసాయ శాఖ ఎడి బి.విజయప్రసాద్, ఎఒ బి.శివకోమలి, పంచాయతీ కార్యదర్శి తదితరులు సన్మానించారు.

అథ్లెటిక్స్‌లో అవంతి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : విజయవాడలో ఏపి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఏపి రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025లో స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సారికి మణికంఠ హైజంప్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం కళాశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి విజయాలు మరెన్నో సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు చంద్రశేఖర్, చంద్రరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రిషియన్ మృతి

ప్రజాశక్తి- యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపాలెం వార్డుకు చెందిన ఎలక్ట్రిషియన్ భీశెట్టి వెంకటరమణ (45) విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. యలమంచిలి పట్టణంలోని ఒక ఇంట్లో వైరింగ్ చేస్తుండగా వెంకటరమణ విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా అనంతరం పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ పెద్ద అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మద్యం తాగొద్దని కొడుకు చెప్పడంతో మనస్థాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన తండ్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. సిఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని చీమలపల్లి గ్రామానికి చెందిన రైతు నగిరెడ్డి సత్యారావుకు మద్యం అలవాటు ఉంది. ఈనెల 6న మద్యం తాగడానికి డబ్బులు ఇమ్మని తన కొడుకును అడిగాడు. అందుకు కొడుకు మద్యం తాగడం మానేయమని, ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా సమస్యలు వస్తున్నాయని చెప్పాడు. దీంతో మనస్థాపం చెందిన తండ్రి సత్యారావు గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : బ్రాండిక్స్‌లో పనిచేస్తున్న పూడిమడక గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి బుధవారం రాత్రి 1:30 సమయంలో ఇంటి నుంచి పరారైనట్లు సిఐ నమ్మి గణేష్ తెలిపారు. బ్రాండిక్స్‌లో విధులు ముగించుకొని ఇంటికి చేరిన యువతి కుటుంబీకులకు చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- కోటవురట్ల : మండలంలో అక్కాహెబోపేట గ్రామంలో చల్లపల్లి లావణ్య (22) గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తుని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. లావణ్యకు రెండేళ్ల క్రితం వివాహమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరసన

ప్రజాశక్తి -పద్మనాభం : ఉపాధ్యాయ సమస్యలపై ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పద్మనాభంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. నిరసనల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పద్మనాభం మండల అధ్యక్షులు ఆర్.మహేష్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దుచేయాలని, పిఆర్‌సి ప్రకటించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని నిరసన వారాన్ని ప్రకటించినట్లు తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు కోతపెట్టే వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. తక్షణమే డిమాండ్ల సాధన కోసం నల్ల బ్యాడ్జీలతో మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేయడానికి సన్నద్ధమవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల ప్రధాన కార్యదర్శి కె.గౌరినాయుడు, మండల ఆడిట్ కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

ఘనంగా ఏచూరి భవన్ ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీలో సిపిఎం విశాఖ జిల్లా నూతన కార్యాలయం (సీతారాం ఏచూరి భవన్) ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. తొలుత వేదిక వద్ద ఉన్న ఏచూరి చిత్రపటానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా రాష్ట్ర, జిల్లా నాయకత్వం, ఇతర వామపక్ష నేతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తొలుత సీతారాం ఏచూరి భవన్ శిలాఫలకాన్ని బేబీ ఆవిష్కరించారు. వి.శ్రీనివాసరావు, పుణ్యవతి, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు, ఎంఎవిఎస్.శర్మ, ఎం.జగ్గునాయుడు, పద్మ, జి.కోటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, ఎస్.సుధాకర్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, అజశర్మ, తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్‌యుసిఐ నాయకులు ప్రమీల తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సభా వేదిక నుంచి బేబీ చేసిన ప్రసంగం ఉత్తేజభరితంగా సాగింది. మద్దిలపాలెం ప్రాంతం రోడ్లన్నీ ఎర్రజెండాలతో అరుణమయంగా మారాయి. ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు ఉత్తేజంగా సాగాయి. చంటి, మౌలాలి ఆలపించిన గీతాలు ఆద్యంతం అలరించాయి.

గదులను ప్రారంభించిన నాయకులు

ఏచూరి భవన్ వద్ద పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ కార్యాలయం మొదటి అంతస్తు మీటింగ్ హాల్‌ను ఎస్.పుణ్యవతి, రెండో అంతస్తులోని జిల్లా కార్యాలయాన్ని సిహెచ్.నర్సింగరావు, మూడో అంతస్తు కాన్ఫరెన్స్ హాల్‌ను వి.శ్రీనివాసరావు, సోషల్ మీడియా హాల్‌ను కె.లోకనాథం, గ్రంథాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రారంభించారు. సెల్లార్‌లోని మద్దిలపాలెం ఆఫీస్‌ను పార్టీ సీనియర్ నాయకులు కె.స్వతంత్ర కుమార్, రెండో రూమ్ కుట్టు మిషన్ కేంద్రాన్ని మరో సీనియర్ నాయకులు ఎస్.సుధాకర్, ఆరోగ్య కేంద్రం గదిని పార్టీ సీనియర్ నాయకురాలు ఆర్.భాగ్యలక్ష్మి, రెండో అంతస్తు జిల్లా కార్యదర్శి గదిని ఎ.అజశర్మ, రెండో గదిని వర్మ, మూడో గదిని ఎన్.రామారావు ప్రారంభించారు. గెస్ట్ రూమ్‌ను ఎస్.జ్యోతీశ్వరరావు, గెస్ట్ రూమ్ 2ను పి.వెంకటరెడ్డి, విద్యార్థి రంగం గదిని ఎం.త్రినాధరావు, కిచెన్ రూమ్‌ను జి.సూర్యచంద్రరావు ప్రారంభించారు.

ఎరుపెక్కిన మద్దిలపాలెం పరిసర ప్రాంతాలు



సీతారాం ఏచూరి భవన్ ప్రారంభంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ

ఆడపిల్లలకు ఉచితంగా కేన్సర్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార కేన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుండి 16వ తేదీ వరకు సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రహమాన్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 నుండి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది ఆడపిల్లలు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని, వారంతా నాలుగు రోజులు పాటు నిర్వహిస్తున్న వాక్సినేషన్ శిబిరాన్ని సందర్శించి వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. మొదటి డోస్ వేసుకొని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండవ డోసు వేసుకొనే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆడపిల్లలు వినియోగించు కోవాలని కోరారు.

ఇపిడిసిఎల్ సివిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సివిఐ)గా నియమితులైన రిటైర్డ్ ఎస్‌పి కెవి.రామకృష్ణప్రసాద్ గురువారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సిఎండి ఇమ్మడి పృథ్వీతేజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో 2024 ఆగస్టు నుంచి 2025 జూలై 31 వరకు సివిఐగా విధులు నిర్వహించిన కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో సేవలందించేందుకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక సాయంపై ఆటో డ్రైవర్ల హర్షం

ప్రజాశక్తి-గోపాలపట్నం : దసరాకు ఆటోడ్రైవర్లుకు కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థికసాయం ప్రకటించడంపై పలువురు డ్రైవర్లు హర్షం వ్యక్తంచేశారు. జివిఎంసి 92వ వార్డు పరిధి గోపాలపట్నం పెట్రోల్ బంక్ సమీపంలో ఆటో డ్రైవర్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ యువనేత పెతకంశెట్టి మౌర్యసింహ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన శేఖర్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కొత్తగా నియమితులైన వైసిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి చొక్కర శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యత గల పదవి ఇచ్చినందుకు జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవిలో నియమించడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావులు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శేఖర్ చెప్పారు.



జగన్మోహన్‌రెడ్డితో చొక్కర శేఖర్

వైసిపి చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరరావు



ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వానపల్లి ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజినల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా పార్టీ ఆఫీస్ ఇన్‌ఛార్జ్ రవి రెడ్డి, 13వ వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలకు వానపల్లి ఈశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

తైనాలను కలిసిన వైసిపి నాయకులు



తైనాల విజయ్ కుమార్‌ను కలిసిన 87వ వార్డు వైసిపి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి పరిశీలకులు తైనాల విజయ్ కుమార్‌ను జివిఎంసి 87వ వార్డు పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. అందరినీ కలుపుకొని పార్టీని ముందుకు నడిపించాలన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో పార్టీ బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ, వార్డు ప్రధాన కార్యదర్శి ముద్దపు దామోదర్, బిసి సెల్ జిల్లా కార్యదర్శి దుగ్గపు దానప్పలు, గాజువాక జగన్ సేవాదళ్ అధ్యక్షులు బోండా గోవిందరాజులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించొద్దు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించొద్దని గోపాలపట్నం ట్రాఫిక్ సిఐ సురేష్, ఎస్ఐ సూరిబాబు వాహనదారులకు సూచించారు. సింహాచలం పాత గోశాలవద్ద వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సరైన దస్త్రాలు లేకుండా యువత ప్రయాణిస్తున్నారని, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇక్కడ ప్రతిరోజూ సుమారు వంద కేసులు నమోదవుతున్నాయని వివరించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే ఎంత ప్రమాదామో తెలిసి కూడా అదే తప్పు పదే పదే చేస్తున్నారన్నారు. ఇకపై సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కెకె.రాజుకు సినర్జీస్ కార్మికుల వినతి



కెకె.రాజుకు వినతిపత్రం అందిస్తున్న సినర్జీస్ కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : దువ్వాడ ఎస్ఇజెడ్‌లో ఉన్న సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు గురువారం వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజును సీతమ్మధారలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని, పిఎఫ్, ఇఎస్ఐ కట్టడంలేదని వివరించారు. యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని తెలిపారు. దీనిపై కెకె.రాజు స్పందిస్తూ కార్మికులకు వైసిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బకాయిలను వెంటనే విడుదల చేసేలా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగ సంఘం ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ దేవదాస్, కార్మికులు పాల్గొన్నారు.

27న దుకాణాలకు వేలం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 5వ జోన్ పరిధిలోని పలు దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్ల నిర్వహణకు ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు జ్ఞానాపురంలోని కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. జోన్ పరిధిలోని వార్డులు 40 నుండి 63 వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు సైడ్ మార్కెట్లకు, 60వ వార్డు పరిధి గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 22, 23, 24, 28, 46, 47, 55, 57 నెంబర్ల దుకాణాలు, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2, 3 నెంబర్ల దుకాణాలు, మలగాడ షాపింగ్ కాంప్లెక్సులోని 3వ నెంబర్ దుకాణం, సుబ్బలక్ష్మీనగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, 9, 13 నెంబర్ల షాపులు, ప్రకాష్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 5వ నెంబర్ దుకాణాలకు మూడేళ్ల కాల పరిమితి వరకు, 51వ వార్డులోని మాధవ స్వామి కల్యాణ మండపం మూడేళ్ల కాల పరిమితి వరకు, మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణం, రోడ్ పక్కన మార్కెట్లకు (హాకర్ మండలం) ఒక సంవత్సరం కాల పరిమితి వరకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేటప్పుడు ధరావత్తు మొత్తం డిడి రూపంలో తీసుకురావాలని తెలిపారు. ఎస్‌సి రిజర్వుడు కేటగిరికి సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఆధార్, పాన్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు జ్ఞానాపురంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న అతిథి గజపతి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహలక్ష్మి నరసింహ స్వామిని విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆమెకు స్వాగతం పలికారు. అతిథిగజపతి ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను అందించారు.

వామపక్ష ఐక్యతకు పరితపించిన సురవరం

ప్రజాశక్తి-అనకాపల్లి : వామపక్షాల ఐక్యత కోసం కీర్తిశేషులు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి పరితపించే వారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి రోటరీ కళ్యాణమండపంలో గురువారం సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ముందుగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ శ్రామిక, కార్మిక వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం సురవరం సుధాకర్ రెడ్డి పోరాటం చేశారని గుర్తు చేశారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసి ఉద్యమం ఉధృతం చేసిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని పేర్కొన్నారు. మతోన్మాద విధానాలతో ప్రజా వ్యతిరేక చర్యలు పాల్పడుతున్న బిజెపి వైఖరిపై సురవరం నినదించారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి నిమిషం వరకు పోరాడిన సురవరం సుధాకర్ రెడ్డి మరణం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు సురవరంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ సురవరం పోరాట పటిమను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న, సిపిఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు, జి.గురుబాబు, తాకాసి వెంకటేశ్వరరావు, వైఎన్ భద్రం, శ్రీరామదాసు అబ్బులు, కోరుబిల్లి శంకర్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సురవరం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు



ఎంపికైన క్రీడాకారులు

అండర్-19 క్రీడా పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-పరవాడ : విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 క్రీడా పోటీలకు ఎంపికలు గురువారం జరిగాయి. డిఇఓ ఎమ్.వినోద్‌బాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎంపికల్లో సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు జరగగా, ఎస్‌వివిఎస్ జూనియర్ కాలేజీలో ఫెన్సింగ్, ఘట్కా, కరాటే, కూరష్, జూడో పోటీలు జరిగాయి. ఎంపికైన ఆటగాళ్లు విశాఖ ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ వివి.పుష్పలత తెలిపారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు చింతల బంగారు నాయుడు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ కుటుంబానికి జనసేన జీవిత బీమా పథకం కింద కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును జనసేన మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు స్థానిక నాయకులతో కలిసి గురువారం అందజేశారు. కార్యక్రమంలో చింతల శ్రీను, చింతల అప్పలరాజు, ఏనుగుల సత్తిబాబు, కరణం పండు, సుంకరి శివ, పల్లి మంగరాజు, కర్రి శివ, కర్రి రాము, కరణం వాసు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పట్టణంలో 84వ వార్డులో రింగ్ రోడ్డు మెయిన్ రోడ్ నుండి కోల్డ్ స్టోరేజ్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కోటి రూపాయల జీవీఎంసీ నిధులతో ఈ విస్తరణ పనులు చేపడుతున్నారు. ఈ పనులను టిడిపి వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు గురువారం పరిశీలించారు.

విలియం కేరీకి సత్కారం

ప్రజాశక్తి-పాయకరావుపేట : రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టరుగా నియమితులైన టిడిపి దళిత నాయకులు పల్లా విలియం కేరిని మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దూలపల్లి ప్రభాకరరావు, పాయకరావుపేట రాజీవ్ నగర్ కాలనీకి చెందిన జనసేన పార్టీ నాయకులు పల్లా బాల, న్యాయవాది నెలపర్తి నాగేశ్వరరావు తదితరులు గురువారం సత్కరించారు.

ఒకే రోజు.. మూడు కాలాల వాతావరణం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలో ఒకే రోజు మూడు కాలాల వాతావరణం చోటుచేసుకుంటుంది. ఉదయాన్నే పొగమంచు కమ్మేసి ఊర్లు మొత్తం కప్పేస్తోంది. అనంతరం మధ్యాహ్నం సమయానికి తీవ్రమైన ఎండ కాస్తుంది. సాయంత్రం సమయానికి మబ్బులు కమ్ముకొని వర్షం కురుస్తోంది. ఒక్కరోజులో మూడు కాలాల వాతావరణం కనిపిస్తోంది. ఈ వాతావరణం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఇప్పటికే పంట పొలాలు నీట మునిగిపోతుండగా, టమోటా, వంకాయ, ఆనపకాయ, బెండకాయ వంటి కూరగాయలు పాడైపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పొలాల్లో నిల్వ నీరు వెళ్లకపోవడంతో కూరగాయల పంట కుళ్లిపోతుందేమోనన్న భయం వారిని వేధిస్తోంది. పొగమంచు వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో వాతావరణం ఇలా మారిపోవడం రైతులను మరింత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దట్టంగా కురుస్తున్న పొగ మంచు



అమ్మకానికి ఉంచిన పుట్ట గొడుగులు

విరివిగా పుట్టగొడుగులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : వర్షాల సీజన్ వచ్చిందంటే చాలు పల్లెల్లో పుట్టగొడుగులు విరివిగా లభిస్తాయి. గురువారం దేవరాపల్లి మార్కెట్‌కు పుట్టగొడుగులను గంపలతో తెచ్చారు. పుట్టగొడుగులు క్షణాల్లో అమ్ముడయ్యాయి. కిలో ధర రూ.400 నుంచి రూ.500 పలికింది. వ్యాపారులు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి విశాఖపట్నం తరలించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే దొరికే ఈ పుట్టగొడుగులు గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని వైద్యులు సూచిస్తున్నారు.

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు గురువారం సందర్శించారు. డిఈఈ ఏ.నాగేశ్వరరావు, జెఈఈ నరేంద్రరెడ్డి ఈ సందర్శనలో భాగంగా బిపిహెచ్ యూనిట్ ఏర్పాటుకు ఇటీవల మంజూరైన రూ.50 లక్షల నిధుల నేపథ్యంలో భవన నిర్మాణ మ్యాప్‌కు కావాల్సిన కొలతలు వేశారు. ఆర్ అండ్ బి అధికారులు నిర్మాణ దశలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించారు. పిహెచ్‌సికి అవసరమైన మౌలిక వసతుల వివరాలను వైద్యాధికారి డాక్టర్ ఈ.పూజ్య మేఘనను అధికారులు అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-కశింకోట : కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్, రూ.8లక్షలతో శ్రీనూకాంబిక అమ్మవారి గుడి ఆవరణంలో సీసీ రోడ్డు ప్లాట్‌ఫామ్, రూ.8లక్షలతో రామాలయం ఆవరణంలో సీసీ రోడ్డు ప్లాట్‌ఫామ్, సంత మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన షెడ్లు, రూ.20లక్షలతో బంగారయ్యపేట గ్రామంలో శివాలయం ఆవరణంలో సీసీ రోడ్డు ప్లాట్‌ఫామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, గల్లా రాజు, ఉల్లింగల రమేష్, నెనంశెట్టి రమణారావు తదితరులు పాల్గొన్నారు.



శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల

పారిశుధ్య కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్‌లో పారిశుధ్యం పనులు నిమిత్తం ప్రత్యేకంగా మున్సిపల్ పారిశుధ్య వర్కులుగా నియమించిన 15 మందికి ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమనిప్రధాన కార్యదర్శి రుత్తల శంకర్రావు పేర్కొన్నారు. బకాయి పడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఈనెల 15వ తేదీన మూకుమ్మడిగా శెలవులు పెట్టి జోనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పనిచేస్తున్నప్పటికీ 7 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా కడుపు మాడ్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సరైన టైంలో జీతాలు బిల్లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ సమస్య పేరు చెప్పి జీతాలు బిల్లు పెట్టకుండా తిప్పడం సరికాదన్నారు. మున్సిపల్ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ వీరి పోరాటానికి ఇతర మున్సిపల్ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారు సాయి, మంగళగిరి ఉపేంద్ర, ఎం.సాయి, నీలాపు లోకేష్, బంగారి శివకుమార్, చెన్నా పోలేంద్ర, గుబ్బని నీల, మణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-కె.కోటపాడు : సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీస్ అధికారులను ఆదేశించారు. కె.కోటపాడు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ గుర్తింపులో సీసీటీవీ కెమెరాలు గ్రామాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లకు 19 డోన్లు ఇవ్వగా, అందులో కె.కోటపాడు ఒకటి కేటాయించినట్లు చెప్పారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్ నిరోధక చట్టం, ఈవ్ టీజింగ్ చట్టాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని, శక్తి యాప్‌ను ప్రతిఒక్కరూ డౌన్లోడ్ చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన ఆదేశించారు. ఈ నెల 13న జరుగు లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు ఎక్కువగా రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి డిఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం సిఐ పి.అప్పలరాజు, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ ఎస్‌ఐలు ఆర్.ధనుంజయ్, సత్యనారాయణ, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల జారీ శిబిరం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా మెడికల్ పెన్షన్ల శిబిరం, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ అనకాపల్లిలో ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, కోనేటి భార్గవ్, చెట్టుపల్లి శ్రీనివాసరావు, కాళ్ల సన్యాసిరావు పాల్గొన్నారు.



కొణతాలకు సమస్యను వివరిస్తున్న పరిరక్షణ సమితి నేతలు

ఆవఖండాన్ని పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి ఆవఖండం ప్రాంతాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఆవఖండం పరిరక్షణ సమితి సభ్యులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్లు వైఎన్.భద్రం, కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు, రాజాన దొరబాబు మాట్లాడుతూ ఆవఖండంలో వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రకృతి విధ్వంసాలను ఆపకపోతే అనకాపల్లికి పెను జల ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 1990 నాటి వరద ప్రమాదాల తీవ్రతను మనం మళ్ళీ చూడవలసి వస్తుందన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ఆవఖండంలో జరుగుతున్న విధ్వంసంపై ఒక కమిటీ వేసి వివరాలు సేకరించి భవిష్యత్తుకు, ప్రకృతికి విఘాతం కలిగించే అక్రమాలను నియంత్రించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సమగ్ర విచారణకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని తెలిపారు.

విదేశీ విద్యపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో స్టడీ కనెక్ట్ సహకారంతో విదేశీ విద్యపై అవగాహన సదస్సు రెండు రోజులపాటు జరిగింది. వివిధ దేశాల కౌన్సిలర్లు విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యా అవకాశాలు, వివిధ కోర్సుల ఎంపికలు, కెరీర్ ప్రణాళికలు, స్కాలర్ షిప్ అప్లికేషన్ ప్రాసెస్, వీసా మార్గదర్శకాలు వంటి అంశాలను పొందుపరచి వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులతో ఒక్కొక్కరికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ సెషన్లు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలు రూపుదిద్దడంలో ఫ్లైట్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, టిపిఒ వై.హేమంత్ కుమార్, విభాగాధిపతులు, స్టడీ కనెక్ట్ సంస్థ నుండి సీనియర్ కౌన్సిలర్లు వై. సూర్యలక్ష్మి ఎన్.మన్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు రూ.5 వేలు విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నరసింగరావుపేట బాల సిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరావు తనయుడు ముత్యాల రాజేష్ రూ.5వేలు విరాళాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోఉపాధి హామీ18వ విడత సోషల్ ఆడిట్ కార్యక్రమం గురువారం జరిగింది. మండలంలో రూ. 14కోట్లతో జరిగిన ఉపాధి హామీ పనుల గురించి సోషల్ ఆడిట్, పబ్లిక్ హియరింగ్‌లో 24 పంచాయతీలకు సంబంధించిన నివేదికను ఉపాధి హామీ సిబ్బంది చదివి వినిపించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ ఆర్.పూర్ణిమదేవి మాట్లాడుతూ ఉపాధి హామీని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రవీంద్ర, క్లస్టర్ ఏపీడీ మాణిక్‌కుమార్, ఎంపీపీ బోకం సూర్యకుమారి రాముునాయుడు, ఎంపీడీఓ పి.పద్మజ, ఎం.గౌరీశంకర్, ఎస్ఆర్ పి.చిరంజీవి అప్పారావు, ఏపీఓ టి.వసంతకుమార్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మెడికల్ కాలేజీలను పిపిపికి ఇవ్వడం తగదు

వైసిపి జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్

ప్రజాశక్తి-కోటవురట్ల : రాష్ట్రంలోని విద్యార్థులకు వైద్య విద్య అందించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన నిర్మాణాలు చేపట్టిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు, పబ్లిక్ పార్టనర్‌షిప్ (పిపిపి)కి ఇవ్వడం తగదని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వద్ద నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాల భవనాలను గురువారం మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌తో కలిసి అమర్‌నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ ప్రైవేటుకు మెడికల్ కాలేజీలు కాదని, వర్షాలకు నీట మునుగుతున్న అమరావతి నిర్మాణాలను అప్పగించాలని ఎద్దేవా చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చినా అనధికారిక నిర్మాణాలంటూ కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఇక్కడ సరిపడా వైద్య కళాశాలలు లేక రాష్ట్ర విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవడంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి గమనించాలని కోరారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనా కాలంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా నిర్మించిన దాఖలాలు లేవని, వైసిపి ప్రభుత్వంలో నిర్మించ తలపెట్టిన వాటిపై విషం చిమ్ముడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య, వైసిపి నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల ఎర్రాపాత్రుడు, సర్వీపట్నం మాకవరపాలెం మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేసిన సిబ్బంది

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగరువు వద్ద ప్రధాన రహదారిపై ఎస్ఎస్-17 బి-10 గల విద్యుత్ స్తంభం వాలిపోయి ప్రజలకు, వాహనదారులకు పెద్ద ముప్పుగా మారింది. దీనిపై ప్రజాశక్తి పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. సంబంధిత ఏఈ, లైన్‌మెన్ బృందం ఘటనాస్థలానికి చేరుకొని వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి, దెబ్బతిన్న లైన్లను పునరుద్ధరించారు. గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ స్తంభం సరి చేసి వైర్లు బిగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

18న చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆటో మోటార్ కార్మికులకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 18న జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్.శంకర్రావు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టడం వలన ఆటో కార్మికులు 60 శాతం పైగా ఆదాయాలు కోల్పోయారని, వీరిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం సంవత్సరానికి రూ.15 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తుందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఆటో కార్మికులకు సమగ్ర చట్టం తీసుకొస్తామని, జీవో నెంబర్ 21 రద్దు చేసి ఇన్సూరెన్స్, ట్యాక్స్, ఫైన్లు తగ్గిస్తామని నమ్మబలికారని, నేడు ఆ ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు సంవత్సరానికి కనీసం రూ.30 వేలు ఇవ్వాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు.

జోన్-2 ఎఎంహెచ్ఒగా రాజా రవికుమార్

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి జోన్-2 ఎఎంహెచ్ఒగా డాక్టర్ రాజా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ కిషోర్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాజా రవికుమార్ మాట్లాడుతూ, జోన్‌లోని వార్డుల పరిధిలో ప్రజారోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేస్తానన్నారు. వార్డుల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. రాజారవికుమార్ గతంలో అల్లూరి జిల్లా పెదబయలులో పశుసంవర్ధక శాఖ సహాయక డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. రాజా రవికుమార్‌ను జోన్ 2 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ మహిళా వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న బిసి మహిళా వసతి గృహంలో 100మంది ఉండాల్సి ఉంటే దాదాపు 200 మంది విద్యార్థినులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని నూతన మహిళా వసతిగృహాలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, ఆర్క్ స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థలలో రెండు రోజుల "ఐ స్క్రీనింగ్ క్యాంప్" గురువారం ప్రారంభమైందన్నారు. క్యాంప్‌ను అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాసీం ప్రారంభించారు. డాక్టర్ ఖాసీం, శంకర్ ఫౌండేషన్ అప్తాలమిస్ట్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ పి.హరీష్ వర్మ, స్టాఫ్ జె.కృపారావు, ఎం.రవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సబ్బవరం సిఐ జి.రామచంద్రరావు సూచించారు. మండలంలోని గాలి భీమవరం సమీపంలో ఉన్న ఆర్యభట్టు పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాలు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు మానసిక, శారీరక ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని చెప్పారు.

మండలానికి పిచికారీ డ్రోన్

ప్రజాశక్తి-యలమంచిలి : మండలానికి 80 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల డ్రోన్ మంజూరైందని మండల వ్యవసాయాధికారి మోహనరావు గురువారం తెలిపారు. ఎరువులు, పురుగుమందులు వెదజల్లే ఈ డ్రోన్ ఎకరంకు 5 నుండి 6 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేస్తుందన్నారు. జంపపాలెంకు చెందిన యువరైతు మణికంఠకు గుంటూరులో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 30 ఎకరాలకు తక్కువ కాకుండా పిచికారీ చేయదలిచే రైతులు వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు.

అమర్‌నాథ్‌కు ఏడువాక కృతజ్ఞతలు

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి పాడేరు, అరకు నియోజకవర్గాల పరిశీలకునిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన గోవాడకు చెందిన ఏడువాక సత్యారావు, తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్‌ను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పల్లా నర్సింగరావు, మొల్లి సోమునాయుడు, మొల్లి ప్రసాద్, ఒరుగంటి నెహ్రూబాబు, ఎంపీపీ గాడి కాసులమ్మ ఉన్నారు.

కెజిబివిలో మిషన్‌శక్తి- సంకల్ప్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలంలోని నేలతేరు కెజిబివి పాఠశాలలో మిషన్ శక్తి-సంకల్ప్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోక్సో చట్టం, బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్య ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీదేవి, సూపర్‌వైజర్ జి.వీరిష, ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలో వికలాంగుల రీవెరిఫికేషన్ సమస్యలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని, కొంతమందికి నోటీసులు జారీ చేయడం, మరికొందరికి అర్హత శాతం తగ్గించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, 2010లో జారీచేసిన సర్టిఫికెట్లనే కొనసాగించాలని డిమాండ్‌చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కొత్తలంక దేముడు ఆధ్వర్యాన ఎంపిడిఒకు గురువారం వినతిపత్రం అందించారు. ఇచ్చిన నోటీసులు రద్దుచేసి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పి.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్‌కుమార్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యార్థులకు చక్కగా విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణగా పాఠశాలను నిర్వహించారని ఉపాధ్యాయులను కొనియాడారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పడాల రమణ, ఉప సర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, నాయకులు ప్రసాదరావు పట్నాయక్, గోలగాని గోవింద, చిల్లరాజు, పైల రమేష్ పాల్గొన్నారు.

2003 డిఎస్‌సి టీచర్లకు ఓపిఎస్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : 2003 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన ఉపాధ్యాయులకు ఓపిఎస్ వర్తింపజేయాలని గురువారం మండల తహశీల్దారు తిరుమలబాబుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. 2003లో నియమించబడ్డ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం ఓపిఎస్ అమలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాల చేసిన ఆలస్యం వల్ల నియామకాలు ఆలస్యం కావడంతో తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు జైబాబు, శ్రీలత, గుడివాడ సతీష్, చిక్కాల శ్రీను పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : వ్యవసాయ క్షేత్రాల్లో యూరియా, ఎరువులు వినియోగంపట్ల రైతులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తహశీల్దారు ఎస్ఎ.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని మంగవరం, సత్యవరం, మాసాహెబుపేట, ఎస్ నర్సాపురం, పెదరాంబద్రపురం, అరట్లకోట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి.త్రినాథ్, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన గౌంతిన

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ సిఎం.రమేష్‌ను తెలుగు రైతు అధికార అధికార ప్రతినిధి గౌంతిన శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టిడిపి నాయకులు యిరా రమణారావు, ఉల్లింగల రమేష్, నారిపల్లి ప్రసాద్, గంజి కుమార్ ఉన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4.83 లక్షల చెక్కులు అందజేశారు. గొలుగొండ మండలానికి 2, నాతవరం మండలానికి 3, నర్సీపట్నం మున్సిపాలిటీకి 3 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలోని 78 మందికి పైగా లబ్ధిదారులకు సుమారు రూ.75,83,602 అందేలా చర్యలు చేపట్టామన్నారు.



చెక్కను ఇస్తున్న స్పీకర్

ఆటో కార్మికులకు రూ.30వేలు ఇవ్వాలి



రావికమతంలో ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-రావికమతం: ఆటో కార్మికులందరికీ ఏడాదికి రూ.30,000ల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ రావికమతం ఆటో యూనియన్ అధ్యక్షుడు కే.వరహాలుబాబు కోరారు. గురువారం రావికమతం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వరహాల బాబు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఆటో యూనియన్ కార్మికుల పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులందరికీ 15 వేలు దసరా కానుకగా అందజేస్తామని ప్రకటించిందన్నారు.గత ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం లేకుండానే పదివేల రూపాయలు ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా అందించిందన్నారు. నేడు ఉచిత బస్సు ప్రయాణం పెట్టడంతో ఆటో కార్మికులందరూ రోడ్డున పడ్డామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంక్షేమ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి, ఆటో యూనియన్ సెక్రటరీ సింహాచలం, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సోమనాయుడు, రావికమతం యూత్ నాయకులు పులగాయల గోవిందు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం భీమిలిలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఓ సంగీత్ మాథుర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, సిహెచ్.కాసుబాబు, కె సందీప్ పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు)ఆధ్వర్యాయ్యం భవన నిర్మాణ కార్మికులు ప్రచారం చేశారు. స్థానిక గచ్చపు వీధి, కాపువీధిలలో ప్రచారం చేపట్టారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఈ నెల 15న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ కె.రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి డి.శివ మాట్లాడుతూ, సుమారు 7 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పథకాలను అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అందిస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్మికులను మోసగిస్తుందని ఆరోపించారు. కోట్లాది రూపాయలు సంక్షేమ బోర్డులో ఉన్నప్పటికీ ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తుందే తప్ప సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న 32 రకాల నిర్మాణ కార్మికులకి ఎటువంటి సహాయం అందించలేదని తెలిపారు. కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డుని కాపాడుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.

జెపి.అగ్రహారం రైతుల ధర్నా



నినాదాలు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-రోలుగుంట:తమ గ్రామానికి శిస్తుదానం కనుమూరి వెంకటాచార్యులకు ఉందని వారికి శిస్తు వసూలు చేసుకునే హక్కు ఉందని రోలుగుంట మండలం జెపి.అగ్రహారం రైతులు దుంగల బుచ్చిరాజు, శంకర్, రొంగల రమణ, వెంకటరాజు తదితర్లు అన్నారు. తమ భూముల ఆక్రమణపై జెపి.అగ్రహారం రామకోవెల వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూర్వం 1823 సంవత్సరానకు ముందు ఒక రోజు ఉప్మాక వెంకటేశ్వరస్వామికి నైవేద్యం పెట్టుటకు దీనిపై ఆధారపడి జీవనోపాధికి జెపి.అగ్రహారం భూమిని 412 ఎకరాల కనుమూరి వెంకటేశ్వరరావుకు శిస్తు వసూలు చేయుటకు శిస్తుదానం చేసినట్లు తమ పెద్దలు చెప్పారన్నారు. అప్పటి నుంచి తమ పెద్దలు శాశ్వత కౌలుకు తీసుకోవడం జరిగిందన్నారు. అప్పట్లో ఈ ప్రాంతం అడవిలో ఉండేదని, సాగుకు పనికి రాని భూమిని కష్టార్జితంతో సాగు చేయడం జరిగిందన్నారు. కొంత కాలం కనుమూరి వారికి శిస్తు చెల్లించడం జరిగిందన్నారు. 1976 ముందు రెండు గ్రామాల పెద్దల సమక్షంలో ఎక్కువ మొత్తం అప్పట్లో లక్ష రూపాయలు చెల్లించామని తెలిపారు. దీని కంటే ముందు 1912లో బ్రిటిష్ సమయంలో సర్వే చేయించారన్నారు. అప్పట్లో 412 ఎకరాలకు 92 సర్వే నెంబర్లుగా సబ్ డివిజన్ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం 1969లో కూడా సర్వే జరిగిందని, అప్పట్లో రైతుల పేరున సబ్ డివిజన్ చేస్తూ ఎఫ్‌ఎంబిఎఫ్‌ఎల్(ఎఫ్‌ఎల్ఆర్) రికార్డులు రైతుల పేర్ల మీద రికార్డు ఉన్నట్లు 2023 సంవత్సరంలో సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న రికార్డు తమ దగ్గర ఉందని తెలిపారు. 1977లో కొందరు రాజకీయ నాయకులు గజిట్ నోటిఫికేషన్ తెచ్చి 92గా ఉన్న సర్వే నెంబర్లను 32 నెంబర్లకు కుదించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని తమకు తెలియకుండా చేశారన్నారు. 2014 సంవత్సరం పూర్వం నుండి సాగులో ఉన్న రైతులకు తెలియజేయకుండా, నోటీసు జారీ చేయకుండా నాగవర్మ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి తహశీల్దార్ సెలవులో ఉండగా 2014, ఆగస్టు 14, 15 తేదీల్లో ఎటువంటి సర్వే జరపకుండా మ్యూటేషన్ చేయించి పాసు పుస్తకాలు తీసుకున్నారన్నారు. 2023లో సమాచార చట్టం ద్వారా తీసుకున్న వివరాలతో తహశీల్దార్ కృష్ణమూర్తిపై కోర్టుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

యూరియా సరఫరా చేయాలి

ప్రజాశక్తి -రావికమతం :రైతాంగం సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా అని చోడవరం నియోజకవర్గం రైతు విభాగం వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు బంటు సన్యాసినాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భ ంగా ఆయన గురువారం విలేకరు లతో మాట్లా డుతూ, ప్రభుత్వం నుంచి వస్తున్న యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలి పోవడం దారుణమన్నారు. రావికమతం మండలంలో చినపాచిల సచివాలయ పరిధిలో గుమ్మాలపాడు, చినపాచిల, మత్స్యపురం, రావికమతం గ్రామాలకు చెందిన సుమారు 2500 మంది రైతాంగానికి నేటి వరకు సుమారు 140 బస్తాల యూరియా అందజేయడం జరిగిందన్నారు. ఈ ఎరువులు ఏ విధంగా సరిపోతాయని ఆయన దుయ్యబట్టారు. ఎప్పుడూ లేని విధంగా రైతాంగం యూరియాకు గగ్గోలు పెడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లు కూడా లేకపోవడం చాలా బాధాకరన్నారు. ప్రతి సచివాలయంలో యూరియా, గ్రోమోర్, పటాసు ఎరువులను రైతాంగానికి అందజేయాలన్నారు. సచివాలయాల వారీగా ప్రతి గ్రామంలో ముందస్తుగా సర్వే నిర్వహించక పోవడంతో తగినంత సరుకు ఇవ్వ లేక పోయారన్నారు. రైతాంగం నాట్లు వేసుకొని నెలల గడుస్తున్నా నేటి వరకు ఎరువులు అందజేయ కపోవడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఎరువులను అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కళాశాలలో కూలిన మరుగుదొడ్డి గోడ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరుగుదొడ్డి గోడ గురువారం కూలింది. ఆ ప్రాంతంలో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలియజేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో బాయ్స్ మరుగుదొడ్డి గోడ వర్షాలకు తడిచి కూలింది. మరుగుదొడ్డి తలుపులకు గెడలు లేవని విద్యార్థులు తెలిపారు.

బలిఘట్టం రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి-నర్సీపట్నం:బలిఘట్టం ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో అన్ని వర్గాల ప్రజలు, స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అడుగడుగునా గోతులు దర్శనమిస్తూ ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నాతవరం, కోటవురట్ల, తుని మండలాల నుంచి నర్సీపట్నంకి వివిధ పనులపై రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను కాలువలో తీసిన పూడిక మట్టితో గుంతలను పూడ్చడం విశేషం. అధికారులు నాయకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరారు.



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్ ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్, ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు వై వెంకటరమణ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తమ ఆర్థిక సహాయంతో సమకూర్చారు. ఈ మేరకు గురువారం హెచ్ఎం బాలాజీ చేతుల మీదుగా 22 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందజేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెటీరియల్‌ను ఇస్తున్న ఉపాధ్యాయులు

సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి-చీడికాడ:గ్రామాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై బి.సతీష్ తెలిపారు. చీడికాడ మండలం బైలపూడి, జైతవరం వై జంక్షన్ వద్ద బైలపూడి కూటమి నాయకులు, జనసేన మండల అధ్యక్షులు జి.వి.మూర్తి, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ ప్రసాద్, టీడీపీ గ్రామ అధ్యక్షులు గణపతి ఆర్థిక సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామంలో అనుమానితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవి మూర్తి, జె.సత్యనారాయణ, గాడి ప్రసాద్, గణపతిను ఎస్ఐ అభినందించారు.



ప్రారంభిస్తున్న ఎస్ఐ

అటవీ అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట అటవీ కార్యాలయంలో గురువారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి కే.శ్రీనివాసరావు, డీఆర్వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి వెంకటరమణ తదితరులు అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ ఉద్యోగుల సంస్మరణ కోసం ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సిబ్బంది

నేడు గొలుగొండ మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాబురావు తెలిపారు. గొలుగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందన్నారు. ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న సిఇఒ జగపతి

చిన్నతరహా పరిశ్రమలకు రుణాల మంజూరు

ప్రజాశక్తి -నక్కపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ రీ ప్రజెంటేటివ్, ఏజెంట్ క్వాలిటీ డెవలప్మెంట్ సంస్థ సీఈవో కాళ్ళ జగపతి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. నక్కపల్లిలో వెలుగు కార్యాలయంలో గురువారం చిన్నతరహా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుపై యూనిట్ల నిర్వాహకులకు, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ఎటువంటి హాని జరగని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. 3 లక్షల రూపాయల వరకు రుణ సౌకర్యం అందించబడుతుందని, చిన్న తరహా పరిశ్రమల్లో రాణించి వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వేంపాడు గ్రామం లో గురువారం శానిటేషన్ పనులను ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పర్యవేక్షించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనుకు సూచించారు.

రణభేరి జాతాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: యుటిఎఫ్ రణభేరి ప్రచార బైక్ జాతాను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. చందనాడలో ప్రచారం చేపట్టారు. గురువారం యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, ఆర్థిక బకాయిలను, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలను వెంటనే మంజూరు చేయాలని, 12వ పిఆర్సిని ప్రకటించాలని డిమ అంతవరకూ 29 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని రణభేరి ప్రచార బైక్ జాతా ఈనెల 15న రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ప్రారంభమై ఆయా జిల్లాల గుండా ప్రయాణిస్తూ 19వ తేదీన ముగుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకుంటే సెప్టెంబర్ 25వ తేదీన విజయవాడలో రణభేరి బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కే సతీష్, మండల అధ్యక్షులు డిఆర్ కే శాస్త్రి, మండల ప్రధాన కార్యదర్శి జి.రాజుబాబు, సహాధ్యక్షులు డి శివయ్య, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, సీనియర్ నాయకులు కిషోర్ శ్రీకాంత్, గోవింద్, నానాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్సి, డిఎ, ఆర్థిక బకాయిలు, ఇతర సమస్యల సాధన కోసం



పాయకరావుపేటలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు



నక్కపల్లిలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 15 నుండి 19వ తేదీ వరకు జరుగు రణభేరీ పోరాట ప్రచార జాతాను జయప్రతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం యుటిఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన 25 వేలకోట్ల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా, ఉద్యోగులకు 12వ పిఆర్‌సిని ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఈ డిమాండ్ల సాధనకు చేపట్టు ప్రచార జాతా 18వ తేదీన అనకాపల్లి జిల్లాకు వస్తుందని, దానిని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 19లోపు రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకుంటే, ఈ నెల 25న విజయవాడలో భారీ రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జోగ రాజేష్, కట్టా శ్రీరామచంద్రమూర్తి, బివివి.రమణ, కెఎస్‌ఆర్‌కె.రాజు, జివి.గోపాల్, చవ్వాకుల వరప్రసాద్, వెలగా సూరిబాబు, డి.ఐజాక్, కట్టా శ్రీను, ఓవి.సతీష్, శ్రీలంక చంటి, ఆదినారాయణ పాల్గొన్నారు.

సాంబారు బదులు.. మరుగు చారు

- గుంటి కొత్తూరు

పాఠశాలలో అమలు కాని మెనూ

ప్రజాశక్తి –చీడికాడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం ప్రభుత్వం చెపుతున్నా మెనూ అమలు చేసిన దాఖలాలు కానరాలేదు. మండలంలోని గుంటి కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నం, సాంబారు, కోడిగుడ్ల కూర పెట్టాల్సి ఉంది. పాఠశాలకు గురువారం 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. విలేకరులు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించగా తాలింపు పెట్టని నీళ్ల చారు, కోడి గుడ్ల పులుసు పెట్టి వడ్డించేందుకు సిద్ధం చేశారు. మెనూ ఏమిటి అని అడిగితే చారు, గుడ్ల కూర పెడుతున్నామని నిర్వాహకులు చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయులను పిలిచి చారులో తాలింపు పెట్టలేదు కదా అంటే రోజు ఇలానే ఉంటుంది ఇందులో వింత ఏముంది అని ప్రధాన ఉపాధ్యాయులు అనడం గమనార్హం. గుడ్ల కూర, సాంబారు పెట్టాలి కదా అంటే సమాధానం చెప్పలేదు. కోడి గుడ్ల కూరలో ఉల్లిపాయలు, మసాలా దినుసులు సైతం కనిపించలేదు.

ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి 2 రమణను వివరణ కోరాగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



మరుగుచారు

సీతారాం ఏచూరి భవన్ ప్రారంభ దృశ్య మాలిక



జెండా ఆవిష్కరణ చేస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరావు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ



సీతారాం ఏచూరి.. ఓ సోషలిస్టు ఆచరణ పథం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి



సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న పిఎన్ఎం కళాకారులు



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు



సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు